# 'కాసాని' గెలుపు.. బీసీల సాధికారతకు నాంది

**బీసీ బిడ్డ గెలుపునకు కంకణబద్ధులై పనిచేయాలి**

**కులహంకారంతోనే బీసీల్లో చిచ్చుపెడుతున్న కాంగ్రెస్ నేతలు**

**బీసీ అభ్యర్థి గెలుపుతోనే బీసీలకు సామాజికంగా న్యాయం**



నీతి, నిజాయితీ, నిబద్ధతతో బీసీలంతా సంఘటితంగా పోరాడితే రాజ్యాధికారం సాధ్యమవుతుందని బీసీ సంఘాలు పేర్కొంటున్నాయి. యాచించే స్థాయి నుంచి రాజకీయంగా శాసించే స్థాయికి ఎదగాలని నేతలు పిలుపునిస్తున్నారు. జనాభాలో బీసీలు అధికంగా ఉన్నప్పటికీ పార్లమెంటులో ప్రాతినిథ్యం లేకుండా పోతున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బీసీలను ఎదగకుండా చేస్తున్న కాంగ్రెస్ నేతల కుట్రలను చేవెళ్ల లోక్‌సభ నుంచే తిప్పికొడదామంటున్నారు. మభ్యపెట్టడం ఇక సాగదని.. ఆధిపత్య వర్గాల పార్టీలకు తేల్చి చెప్పాల్సిన సమయం వచ్చిందని నేతలు పేర్కొంటున్నారు. మన ఓట్లు మనమే వేసుకుందాం.. అనే నినాదాన్ని అన్ని గ్రామాలకు, బీసీ కులాలకు చేరేటట్లు చేసి మేల్కొలుపుదామని చెబుతున్నారు. బీసీ బిడ్డ కాసానిని గెలిపించే బాధ్యతను బీసీలంతా తీసుకుని కంకణబద్ధులై పనిచేయాలని వారు కోరుతున్నారు. కాసాని గెలుపుతో బీసీల సాధికారతకు నాంది పలకడమేగాక బీసీలోని అన్ని కులాలకు సామాజికంగా న్యాయం జరుగుతుందని బీసీ సంఘాల నేతలు స్పష్టం చేస్తున్నారు.

**- రంగారెడ్డి, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ)**

### కాసాని గెలుపునకు కృషి చేయాలి



చేవెళ్ల ఎంపీ అభ్యర్థిగా బీసీ బిడ్డ కాసానికి టికెట్ ఇచ్చి బీఆర్ఎస్ ఈ వర్గంపై తన చిత్తశుద్ధిని చాటుకున్నది. జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుని బీసీల్లో ఐక్యతను నిరూపించుకుందాం. ఇతర పార్టీలు బీసీ వర్గాలకు సీటు ఇవ్వకపోవటంతోపాటు.. అవహేళనగా మాట్లాడటం సరికాదు. బీసీలు సైతం ఈ ఎన్నికల్లో విజ్ఞతతో వ్యవహరించాలి. **- శివ, గొట్టిముక్కల, వికారాబాద్**

### బీసీల ఓట్లే అధికం



అన్ని కులాల్లో బీసీల ఓట్లే అధికంగా ఉన్నాయి. తక్కువ శాతం ఉన్న కులాల వారు రాజకీయాల్లో రాణిస్తున్నారు. బీసీలను ఎన్నో ఏండ్లుగా అణగదొక్కుతున్నారు. ఇప్పటికైనా బీసీలు ఏకమై అహంకారంతో బీసీలను చులకనగా చేసి మాట్లాడుతున్న నేతలకు బుద్ధిచెబుదాం. బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకొని బీసీల సత్తా ఏంటో చూపిద్దాం. **- శ్రీనివాస్, గొట్టిముక్కల, వికారాబాద్**

### బడుగుల ఐక్యతను చాటి.. కాసానిని గెలిపిద్దాం



బడుగుల కోసం పోరాటం చేసే వ్యక్తి కాసానిని పార్లమెంట్ ఎన్నికల్లో అఖండ మెజార్టీతో గెలిపించుకుంటాం. ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనార్టీల కోసం పోరాటం చేసే వ్యక్తి జ్ఞానేశ్వర్. ప్రజా సంక్షేమం కోసం పాటుపడే నాయకుడు కాసాని గెలుపునకు అందరూ కట్టుబడి ఉండాలి. జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకుని అహంకారపూరిత నేతలకు గుణపాఠం నేర్పాలి. **- లక్ష్మప్ప, తాండూరు**

### ముదిరాజ్ బిడ్డను గెలిపించుకుంటాం



బీసీ నేత కాసానిని గెలిపించుకుంటాం. 96 కులాల ఐక్యవేదిక సాక్షిగా పార్లమెంట్ ఎన్నికల్లో జ్ఞానేశ్వర్‌కు మెజార్టీ తీసుకువచ్చేందుకు కృషి చేస్తాం. ముదిరాజ్‌లకు పార్టీ అండగా ఉన్నది. రాబోయే ఎన్నికల్లో కచ్చితంగా బీఆర్ఎస్ విజయం ఖాయం. ఈ ప్రాంతంపై పూర్తి అనుభవం ఉన్న నేత కాసానిని ఎంపీగా గెలిపించుకుంటే చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుంది. **- శివరాజ్, తాండూరు**

### చేవెళ్ల గడ్డపై బీసీల సత్తా చాటుదాం



పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల గడ్డపై బీసీల సత్తా ఏంటో చూపిద్దాం. జనాభాలో అత్యధికంగా ఉన్న బీసీలంతా ఏకతాటిపైకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. బీసీ నేతకు చేవెళ్ల ఎంపీ అభ్యర్థిగా టికెట్ కేటాయించిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలియజేస్తున్నాం. చేవెళ్ల బరిలో నిలిచిన కాసాని జ్ఞానేశ్వర్ బీసీల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారు. **- రాజుగౌడ్, హైతాబాద్, షాబాద్ మండలం**

### కాసానిని భారీ మెజార్టీతో గెలిపించుకుందాం



చేవెళ్ల బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థిగా బరిలో నిలిచిన కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందాం. బీసీలకు దమ్ము, ధైర్యం ఉంటే కాసానిని గెలిపించుకోవాలని ఓ నాయకుడు విసిరిన సవాల్‌ను బీసీలంతా గమనించి ఓటు రూపంలో మన సత్తా చాటాలి. గతంలో ఎంపీలుగా ఉన్న నాయకులు సొంత ప్రయోజనాల కోసం పార్టీలు మారుతున్న విషయాన్ని ప్రజలందరూ గమనిస్తున్నారు. **- దినేశ్‌యాదవ్, కుమ్మరిగూడ, షాబాద్ మండలం**

### బీసీ బిడ్డ కాసానిని పార్లమెంట్‌కు పంపుతాం



బీసీ బిడ్డ కాసానిని పార్లమెంట్‌కు పంపి బీసీల ఐక్యతను చాటుతాం. ఏండ్ల కాలం నుంచి బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా వాడుకుంటున్న కొంతమంది కాసాని జ్ఞానేశ్వర్‌కు టికెట్ ఇస్తే ఎలా గెలిపిస్తారని వెకిలి చేష్టలు చేస్తున్నారు. బీసీ బిడ్డ జ్ఞానేశ్వర్‌కు అండగా ఉంటాం. పార్లమెంట్‌లో బీసీల అభివృద్ధి కోసం గొంతెత్తే నాయకుడు కాసానిని గెలిపిస్తాం. **- శ్రీధర్‌గౌడ్, గౌడ సంఘం నాయకుడు, పాలమాకుల**

### బీసీ బిడ్డను గెలిపించి సత్తా చాటుతాం



బీసీ బిడ్డ కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించి సత్తా చాటుతాం. చేవెళ్లకు ఎంపీ నియోజకవర్గం నుంచి బహుజన బిడ్డ కాసానిని గెలిపించి పార్లమెంట్‌లో బీసీలకు రావాల్సిన నిధులు తీసుకువచ్చేలా చూస్తాం. కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ గెలుపుతో అగ్రవర్ణాల్లోని కొంతమంది నాయకులకు తగిన బుద్ధి చెబుతాం. **- ఆంజనేయులు ముదిరాజ్, బీసీ నాయకుడు, శంషాబాద్**

### బహుజనులమంతా ఏకం అవుదాం



బహుజనులమంతా ఏకం అవుదాం. కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకొని ఆత్మగౌరవాన్ని కాపాడుకుందాం. అహంకారపరులు బీసీలకు దమ్ములేదని ఎగతాళిగా మాట్లాడుతున్నారు. అమ్ముడుపోయేవాళ్లని.. ధైర్యం ఉంటే బీసీ అభ్యర్థిని గెలిపించుకోవాలని సవాల్ విసురుతున్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలను ఏకం చేసి చేవెళ్ల గడ్డపై విజయ కేతనం ఎగురవేద్దాం. **- విజయ్ కుమార్, బీసీ సంఘం నాయకుడు**

### బీసీల ఓట్లు చీలిపోకుండా చేద్దాం



చేవెళ్ల నియోజకవర్గంలో ఉన్న ప్రతి బీసీ ఓటరును కలుద్దాం. బీసీల సంక్షేమానికి నిరంతరం కృషి చేసిన కాసానిలాంటి పెద్ద మనిషిని గెలిపించుకుందాం. బీసీలం చీలిపోతే చిన్న చూపు చూస్తారు. అలాంటి పరిస్థితి రాకుండా చూద్దాం. సంఘటితమవుదాం. బీసీల సత్తా చాటుదాం. అత్యధికంగా ఉన్న బీసీలను అగౌరవపరుస్తున్న అహంకారపరులకు గుణపాఠం చెబుదాం. **- ఆనంద్ గౌడ్, గౌడ సంఘం నాయకుడు**

### బీసీల ఐక్యతతో జ్ఞానేశ్వర్‌కు ఓటేసి గెలిపిస్తాం



బీసీలందరం ఐక్యతతో ఉండి ఎంపీ అభ్యర్థిగా బీఆర్ఎస్ నుంచి బరిలో ఉన్న కాసాని జ్ఞానేశ్వర్‌కు ఓట్లేసి గెలిపిస్తాం. గతంలో కాసాని జ్ఞానేశ్వర్ 96 బీసీ కులాలను ఏకం చేసేందుకు కృషి చేశారు. కాంగ్రెస్, బీజేపీలు రెడ్డి సామాజిక వర్గాలకు టికెట్లు ఇచ్చారు. రెడ్డీలను ఓడించి కాసానిని భారీ మెజార్టీతో గెలిపిస్తాం. **- రవిగౌడ్, అంగడి చిట్టంపల్లి, పూడూరు మండలం**

### కాసాని గెలుపు ఖాయం



ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అభ్యున్నతికి ఎంతో కృషి చేసిన కాసాని జ్ఞానేశ్వర్ గెలుపు ఖాయం. ఆయన గతంలోనే ఈ ప్రాంతానికి చెందిన బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలిచారు. అలాంటి నాయకుడు పార్లమెంట్‌కు వెళ్తే నిరుపేదల సమస్యల పరిష్కారంతోపాటు అభివృద్ధి చెందుతారు. బీసీ నాయకుడికి బీఆర్ఎస్ పార్టీ టికెట్ ఇవ్వడం అభినందనీయం. **- అశోక్, దేవనోనిగూడెం, పూడూరు మండలం**

### కలిసికట్టుగా పోరాటం చేద్దాం



కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే నాయకులు అహంకారంతో ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడుతున్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి బీసీలంటే అర్థమయ్యేలా గుణపాఠం చెప్పాలి. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయకుండా మనల్ని మనం కాపాడుకునే ప్రయత్నం చేద్దాం. బీసీ అభ్యర్థి కాసానికి మద్దతిచ్చి గెలిపించాలి. **- శేఖర్, మాదాపూర్**

### బీసీ నేతకే మద్దతివ్వాలి



కులమతాలను అనేక మంది రాజకీయాలకు ముడిపెడుతున్నారు. కుల పిచ్చితో ఇష్టం వచ్చినట్లు ఇతర కులాలను కించపరిచేలా మాట్లాడటం ఎంతవరకు సమంజసం. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే బీసీల గురించి తమ ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడుతున్నారు. కాసానిని గెలిపించి కాంగ్రెస్ పార్టీకి బీసీల బలమెంతో తెలియజేస్తాం. **- రవికుమార్, హఫీజ్‌పేట్**



# వేసవిలో కనుపాపలు జరభద్రం..

**అతినీలలోహిత కిరణాలతో నష్టం..**

**చలువ కండ్ల అద్దాలతో కంటికి రక్షణ..**

ఇబ్రహీంపట్నంరూరల్, ఏప్రిల్ 24 : వాతావరణం కాలుష్యం, దుమ్ము, ధూళి కణాలతో కండ్లకు నష్టం వాటిల్లుతుంది. ముఖ్యంగా వేసవిలో ఎండ తీవ్రతతో మరింత ముప్పు పొంచి ఉందంటున్నారు కంటి వైద్య నిపుణులు. ఈ పరిస్థితి నివారణకు నాణ్యమైన చలువ కండ్ల అద్దాలను(కూలింగ్ గ్లాసెస్) ధరించటం మేలని సూచిస్తున్నారు. అయితే వీటి ఎంపిక విషయంలో అజాగ్రత్త ఎంత మాత్రం పనికిరాదని, లేదంటే కంటి సమస్యలు తప్పవని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

**ఓజోన్ పొరను దాటి..**

సూర్యుని నుంచి వెలువడే అతినీలలోహిత కిరణాల(యూవీ)లోని ఏబీ రకాలతో నేత్రాలకు ముప్పు ఏర్పడుతుంది. సాధారణ రోజుల్లో కంటే వేసవిలో ఈ ప్రమాదం ఎక్కువ అని వైద్యులు పేర్కొంటున్నారు. యూవీ కిరణాలు 320-400 నానోమీటర్ల ఓజోన్ పొరను దాటుకుని భూమి పైకి వస్తున్నాయి. యూవీ కిరణాలు 280-320 నానోమీటర్లను చాలా వరకు ఓజోన్ పొర గ్రహిస్తుంది. కాబట్టి కొద్ది మొత్తంలో భూమి పైకి చేరుకుంటున్నాయి. వీటితో నేత్ర సమస్యలు ఏర్పడుతున్నాయి.



**ఎన్నో రకాలు...**

అతినీలలోహిత కిరణాల నుంచి నేత్రాల రక్షణకు పలు రకాల కండ్ల అద్దాలు మార్కెట్‌లో లభ్యమవుతున్నాయి. వీటి ఎంపికలో తగిన జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలి.

**బీ2 లెన్స్ గాగుల్స్..**

వీటిని పూర్తిగా ఎండలో వాడతారు. సాయంత్రం అయితే వినియోగానికి పనికిరావు. నాణ్యత చాలా తక్కువ. ఇవి రూ.50-300 వరకు ధరలో లభిస్తాయి. వీటిని ధరించకపోవటమే మంచిదని కంటి వైద్య నిపుణులు పేర్కొంటున్నారు.

**పోలీకార్బనైట్ లెన్స్..**

నాణ్యత మెరుగ్గా ఉంటుంది. బరువు తక్కువగా ఉండి, పగిలిపోవటానికి అవకాశం తక్కువ. రూ.500-2,000ల వరకు ఉంటుంది.

**పోలరైజ్‌డ్ లెన్స్..**

వీటితో 100-400శాతం వరకు అతినీలలోహిత (యూవీ) కిరణాల నుంచి నేత్రాలకు రక్షణ లభిస్తుంది. ఎండ నుంచి రక్షణతో పాటు వాహనాలను నడిపేటప్పుడు ఎదురుగా వచ్చే వాహనాల లైట్లు వెలుతురు నేరుగా కండ్లపై పడకుండా రక్షణ ఇస్తాయి. ఎండలో ఆడే క్రీడాకారులు, స్విమ్మింగ్ చేసేవారికి ఎంతో ఉపశమనమిస్తుంది. వీటి ధర రూ.500-60,000ల వరకు ఉంటుంది.

**నాణ్యతను బట్టి..**

కండ్లజోడు అద్దాలు సెంటర్, వైడర్ విజన్ రకాల్లో లభిస్తాయి. సాధారణ లెన్స్‌లో మధ్య నుంచి చూస్తేనే కనిపిస్తుంది. ఫ్లాట్ లెన్స్ వైడర్ విజన్‌లో ఇరువైపులా 10, 15, 20, 25, 40 అడుగుల మేరకు చూపు వెళుతుంది.

**స్విమ్మింగ్‌పూల్‌లో...**

వేసవి కాలంలో చాలా మంది స్విమ్మింగ్‌పూల్‌లను ఆశ్రయిస్తుంటారు. పూల్‌లో నీటి శుద్ధి కోసం క్లోరైన్ తదితర రసాయనాలను కలుపుతారు. వీటి కారణంగా కండ్లు దురద, ఎర్రగా మారటం వంటి లక్షణాలు కనిపిస్తాయి. నివారణకు కళ్లజోడును ధరించటం మంచిది. బయటికి రాగానే నీటితో నేత్రాలను కడుక్కోవాలి.

- వేసవిలో కళ్ల అద్దాలను ధరించటం వలన ఎన్నో ప్రయోజనాలున్నాయి...
- దుమ్ము, ధూళి నుంచి కళ్లకు రక్షణ ఇస్తాయి.
- ఉదయం నుంచి సాయంత్రం వరకు బయట తిరిగే వారు కళ్ల అద్దాలను ధరించటం మంచిది.
- ఎండలో వాహనాలు నడిపేటప్పుడు సూర్యుని కాంతి నేరుగా కళ్లపై పడటం వలన ఎదురుగా వస్తున్న వాహనం స్పష్టంగా కనిపించదు. చలువ కళ్ల జోడుతో దూరదృష్టి స్పష్టంగా కనిపిస్తుంది.
- అతినీలలోహిత కిరణాలతో కార్నియా, రెటీనా దెబ్బతినే ప్రమాదముంది. ఈ కిరణాల నుంచి రక్షణ ఉన్న జోడునే ఎంపిక చేసుకోవాలి.

# ముమ్మరంగా వాహనాల తనిఖీలు

**రూ. 31లక్షల నగదు స్వాధీనం**

ఆదిబట్ల, ఏప్రిల్ 24: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఆదిబట్ల పోలీసులు వాహనాల తనిఖీలు ముమ్మరం చేశారు. ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఔటర్ రింగురోడ్డు పరిసర ప్రాంతాల్లో పోలీస్ సిబ్బందితో వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నారు. ఔటర్ రింగు రోడ్డు ఎగ్జిట్ నంబర్12 వద్ద, వండర్‌లా సమీపంలో బొంగుళూరు సమీపంలోఆదిబట్ల నుంచి నాదర్‌గుల్ వెళ్లే రహదారిలో కొంగరకలాన్ సమీపంలో పోలీస్ చెక్ పోస్టులను ఏర్పాటు చేసి ప్రతి రోజూ వాహనాలను తనిఖీ చేస్తున్నారు.



**ప్రతివాహనం తనిఖీ చేస్తున్నాం**



ప్రతి రోజూ వాహనాల తనిఖీలు చేపడుతున్నాం. ఇప్పటి వరకు ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చేపట్టిన తనిఖీల్లో ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.31లక్షల నగదును స్వాధీనం చేసుకున్నాం. ఆ నగదును గ్రీవెన్స్ సెల్‌కు పంపించాం. వాటికి సంబంధించిన పత్రాలు చూపించి నగదును తీసుకుపోవచ్చు. **- రాఘవేందర్‌రెడ్డి, ఆదిబట్ల సీఐ**

## డిప్లొమా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

షాబాద్, ఏప్రిల్ 24: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వెంకటగిరిలోని ప్రగడ కోటయ్య మెమోరియల్ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్స్ టెక్నాలజీలో హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ టెక్నాలజీలో డిప్లొమా కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హైదరాబాద్/రంగారెడ్డి జిల్లాల చేనేత, జౌళిశాఖ సహాయ సంచాలకులు వి.ఇందిర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని చేనేత సహకార సంఘాలు, సహకారేతర రంగంలోని చేనేత కార్మికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. తెలంగాణ అభ్యర్థులకు కేటాయించిన 9 సీట్లకు మొదటి సంవత్సరం డిప్లొమా కోర్సులో ప్రవేశం కోసం దరఖాస్తులు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. అర్హత గల అభ్యర్థులు 10-06-2024లోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను ప్రిన్సిపాల్, SPKM ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ, వెంకటగిరి-524132 చిరునామాకు పంపించాలని సూచించారు.

# వైభవంగా రథోత్సవం

మొయినాబాద్, ఏప్రిల్ 24 : గోవింద నామస్మరణ.. వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య చిలుకూరు బాలాజీ ఆలయ బ్రహ్మోత్సవాలు కనుల పండువగా నిర్వహించారు. మూడవ ప్రధాన ఘట్టమైన స్వామి వారి దివ్య రథోత్సవ కార్యక్రమం మంగళవారం అర్ధరాత్రి వైభవోపేతంగా జరిగింది. చిలుకూరు వేంకటేశ్వరస్వామి శ్రీదేవి, భూదేవిలకు ముందుగా ఆలయంలో పూజలు చేశారు. పల్లకీలో విగ్రహాలను ఆలయం నుంచి దివ్య రథోత్సవం వద్దకు ఊరేగింపుగా తీసుకుని వచ్చారు. రథోత్సవం ముందు అర్చకులు హోమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ గునుగుర్తి నక్షత్రం, మాజీ సర్పంచ్ గునుగుర్తి స్వరూప, ఆలయ కమిటీ చైర్మన్ ఎంవీ సౌందరరాజన్, కన్వీనర్ గోపాలకృష్ణస్వామి, అర్చకులు సీఎస్ రంగరాజన్, పరవస్తు రామాచారి, కిరణ్‌తిరుమల, నర్సింహ్మన్, కన్నయ్యస్వామి, కిట్టుస్వామి, మురళీస్వామి, కృష్ణమూర్తి, సురేశ్‌స్వామి, అనిల్‌స్వామి పాల్గొన్నారు.



రథాన్ని ఊరేగిస్తూ..



పల్లకీలో స్వామివారు, అమ్మవార్లను ఊరేగిస్తున్న భక్తులు

## పాలీసెట్ దరఖాస్తు గడువు పొడిగింపు

వికారాబాద్, ఏప్రిల్ 24 : పాలీసెట్ - 2024 ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకునే తేదీ పొడిగించడం జరిగిందని పాలీసెట్ జిల్లా కోఆర్డినేటర్, ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.పరమేశ్వర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28 వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఫీజు చెల్లించవచ్చని అన్నారు. రూ 100ల అపరాధ రుసుముతో ఈ నెల 30 తేదీ వరకు, రూ. 300ల అపరాధ రుసుముతో వచ్చే నెల 20 వరకు ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష వచ్చేనెల 24వ తేదీన ఉంటుందని ఆయన తెలిపారు.

## ఇంటర్ ఫలితాల్లో సత్తాచాటిన గురుకుల విద్యార్థులు

వికారాబాద్, ఏప్రిల్ 24 : జిల్లాలో ఈ సంవత్సరం వెనుకబడిన తరగతుల వసతి గృహంలో ఇంటర్మీడియట్ పరీక్షలకు మొదటి సంవత్సరం 266 మంది విద్యార్థులు హాజరు కాగా, 146 మంది విద్యార్థులు ఉత్తీర్ణులు అయ్యారని వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి కే.ఉపేందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వసతి గృహం వారీగా చూసినట్లయితే 55 శాతం ఉత్తీర్ణత సాధించారని, జిల్లా స్థాయిలో 53 శాతం మంది విద్యార్థులు మొదటి సంవత్సరంలో ఉత్తీర్ణత సాధించినట్లు ఆయన తెలిపారు. రెండో సంవత్సరంలో 300 విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, అందులో 220 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. వసతి గృహం వారిగా చూస్తే 73 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత కలిగి ఉన్నారని, అదేవిధంగా జిల్లా వారీగా ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరంలో 61శాతం విద్యార్థులు ఉత్తీర్ణత శాతం ఉందని ఆయన పేర్కొన్నారు.

## రీవాల్యుయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 24 : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ పరీక్షా ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అధికారులు తెలిపారు. బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ రెండో సెమిస్టర్ రెగ్యులర్, మొదటి సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. విద్యార్థులు తమ మార్కు మెమోలను మూడు వారాల తరువాత నుంచి సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని సూచించారు.

# పోలింగ్ సజావుగా నిర్వహించాలి

**రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్**

**వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ నారాయణరెడ్డి**




వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్

వికారాబాద్, ఏప్రిల్ 24 : పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సజావుగా నిర్వహించేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ అన్నారు. బుధవారం ఇతర ఉన్నతాధికారులతో కలిసి ఆయన నామినేషన్ల స్క్రూట్నీ, బ్యాలెట్‌ల పేపర్ ముద్రణ, హోం ఓటింగ్, ఓటర్ స్లిప్పుల పంపిణీ తదితర అంశాలపై జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ వీసీలో సమీకృత కలెక్టరేట్ నుంచి కలెక్టర్ సి. నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్లు రాహుల్‌శర్మ, లింగ్యానాయక్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ మాట్లాడుతూ పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించి ఏప్రిల్ 26వ తేదీ నాటికి ఓటరు తుది జాబితా రూపొందించాలన్నారు. ప్రతి ఓటర్‌కు ఓటర్ స్లిప్పు పంపిణీ కోసం నిర్దేశిత షెడ్యూల్ రూపొందించి బూత్‌స్థాయి అధికారుల ద్వారా ప్రతి ఓటర్‌కు ఓటర్ స్లిప్పు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు వచ్చే ఓటర్లకు తాగునీరు అందుబాటులో ఉండేలా చూడాలని, జిల్లాలో వెబ్ క్యాస్టింగ్ చేస్తున్న పోలింగ్ కేంద్రాల వివరాలు సమర్పించాలని సూచించారు. మిగిలిన పోలింగ్ కేంద్రాల బయట సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఫారం 12డీ కింద ఇంటి వద్ద ఓటు హక్కు వినియోగించుకునేందుకు దరఖాస్తు చేసుకున్న దివ్యాంగులు, సీనియర్ సిటిజన్లు, ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. మే 13న పకడ్బందీగా పోలింగ్ జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని, పోలింగ్ విధుల్లో పాల్గొనే సిబ్బందికి అవసరమైన శిక్షణ అందించాలని తెలిపారు. అసెంబ్లీ సెగ్మెంట్ వారీగా డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు రిసెప్షన్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఉదయమే మాక్ పోల్ నిర్వహించాలని, ప్రతి రెండు గంటలకు పోలింగ్ వివరాలపై ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. పోలింగ్ ప్రక్రియలో ఈవీఎం యంత్రాలు మొరాయించినట్లయితే వెంటనే రిజర్వ్ ఈవీఎం యంత్రాలను సెక్టార్ అధికారులు మార్చే విధంగా సన్నద్ధంగా ఉండాలని అన్నారు. అనంతరం కలెక్టర్ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులతో మాట్లాడుతూ ఫామ్ 12-డి రిజెక్టును ప్రాపర్‌గా చెక్ చేయాలని, హోమ్ ఓటింగ్ ఏర్పాట్లు చేసి, కాంటెస్టింగ్ కాండిడేట్ ఫైనల్ చేసిన తరువాత గుర్తించిన అభ్యర్థులకు ఓటర్ లిస్ట్, పోలింగ్ స్టేషన్ల లిస్ట్ అందజేయాలన్నారు. ఓటర్లకు ఓటర్ స్లిప్‌లు అందజేయాలని, పోస్టల్ బ్యాలట్ ద్వారా ఓటు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్డీవోలు వాసు చంద్ర, శ్రీనివాస్ రావు, డి.పి.ఓ జయసుధ, ఎన్నికల విభాగం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ నారా యణరెడ్డి, అదనపు కలెక్టర్లు తదితరులు